ప్రజాస్వామ్యం

పి. చందు

"ఈ ఎలక్షన్స్ ఏమోగాని మన ప్రాణాలు తినేస్తుంది" దుప్పటి ముసుగును గట్టిగా బిగించుకుంటు, రివ్వున వీస్తున్న చల్లగాలిని తప్పించుకునే ప్రయత్నం చేస్తూ అన్నాడు.

లారీ వేగంగా దూసుక పోతుంది. ముసక చీకట్లో ఆకాశాన్ని తాకుతున్నట్టుగా ఉన్న చెట్లను, చెట్లమాటున దాగి ఉన్న చిక్కటి చీకటిని చూస్తుండిపోయాను. నాకు అడివి ప్రాంతంలో తిరగటం కొత్త. పుస్తకాల్లో, కథల్లో బొమ్మల్లో చూసిన, నేను ఊహించుకున్న అడివికి, వాస్తవంగా కనిపిస్తున్న అడివికి ఎంతవ్యత్యాసముందో పరిశీలిస్తుండి నా మిత్రుడి మాటలు విన్పించుకోలె.

"చల్లగా ఈదరేస్తుంటే ఎంటీ అలా నిలబడి చూస్తున్నావు చక్కగా కూచొని నీ దగ్గరున్న దుప్పటితో ముసుగేసుకో చలిదెబ్బ కొట్టేదుంటే మందుండదు మాకుండదు ఊరికే సచ్చి వూరుకుంటావు"

నేను నా మిత్రునికేసి చూసాను. నా మిత్రుడు మధుతోపాటు ఆ రూట్లో ఉన్న పోలింగ్ బూత్‌లో పన్జేసేందుకు పోలింగ్ ఆఫీసర్సు, ప్రిసైడింగ్ ఆఫీసర్సు తమకు అప్పజెప్పిన ఎన్నికల సామాను గోనెసంచుల్లో మూటలు కట్టుకొని వాటిమట్టు ముసుగులు తన్ని కునికిపాట్లు పడుతున్నారు

"ఏంరా వినబడుతలేదా' నా చొక్కపట్టి లాగాడు. నేను వాడిపక్కన కూలబడ్డాను. నిజంగానే బాగా చలిగా ఉంది, డిసంబర్ మాసపు చలి మనుషులను కొరికేస్తుంది. గుంపు మధ్యలో కూచునేసరికి కాస్త వెచ్చగా హాయిగా ఉందికూడా. నా జేబులు తడుముకున్నాను సిగిరెట్టు కోసము లాభము లేక నా మిత్రుని జేబు తడిమాను చెరో సిగిరెట్టు వెల్గించుకొని హాయిగా దమ్ములాగుతూ 'మనం ఎంతదూరం వచ్చామో తెల్సా' అన్నాడు.

తెల్వదన్నట్టు తలూపాను.

"రాత్రి మనం బయల్దేరేసరికి రెండయింది, ఇప్పుడెంతయిందో తెల్సిందా పావు తక్కువ ఐదు. ఇంకో పావుగంటయితే మూడు గంటలు. మనం మన గమ్యం చేరుకునేసరికి ఉదయం పదిగంటలవుతుందేమో?"

"అంత దూరముందేమిటి"

"దూరమంటే దూరమే అది కాకుండా మన పోలింగ్ బూతే చివరిది. వీళ్ళందరినిదించి మన గమ్యం చేరుకునేసరికి అంతే లైమౌతుంది. నీకైతేకొత్తగా వచ్చుగాని నాకు ఎలక్షను డ్యూటి ఇది మూడవసారి. ఎప్పుడుకూడా ఇలా అడవులు పట్టుకొని తిరగాల్సిన కర్మపట్టలేదు. ఎంచక్కా 'సిటీ'లనే వడేది. మనకు కావల్సిన ఇంతజామ్ బహు జోరుగా ఉండేది. ఇప్పుడెలా ఉంటుందో ఏమో." కాస్త రంది పడుతున్నట్టుగా.

"ఎప్పుడు తిండి జానమేనా మనం పనిగట్టుకొని చూస్తామా చెప్పు" కొద్దిగా ఉత్సాహం పరుస్తామని.

"ఏముందిరాబాబు చూడటానికి అడివిలో" ఇంకా ఏదో చెప్పబోయినోడు లారీ రోడు మీద మలుపు తిరిగేసరికి ఒకసారిగా మొగ్గిండు. రోడ్డుమీద దుమ్ము పెద్దగా లేచి మమ్మల్ని ఆవరించింది. అలా కొద్దిదూరం వెళ్ళేసరికి నాలుగైదు ఇండ్లున్న ఊరొకటి వచ్చింది.

"39వ పోలింగ్ బూత్ వచ్చింది. 39 పోలింగ్ బూత్ పోలింగ్ ఆఫీసర్ప ప్రిసైడింగ్ ఆఫీసరు ఎస్కార్టు దిగుండ్లి" మాకు రూట్ గైడుగా ఉన్నతను క్యాబిన్లో కూచొని పెద్దగా నోరు తెరుచుకొని అరవటం మొదలు పెట్టిండు.

పోలింగ్ ఆఫీసర్లు, ప్రిసైడింగ్ ఆఫీసరు ఎస్కార్టు దిగిపోయారు. లారీ వెంటనే బయలుదేరలేదు. రూట్ ఆఫీసరు కోసం చూస్తుండిపోయారు. కాసేపు అయిన తర్వాత రూట్ ఆఫీసరు సల్గురు సాయుధబటులతో వచ్చాడు. వచ్చి రావటం తోటే ఊరి పటేల్ను పిలిచి 'తిండి ఏర్పాట్లు ఎలా ఉన్నాయో' అడిగిండు. అన్ని సరిగానే ఉన్నాయని తెల్సుకొని మళ్ళీ అక్కడినుండి బయలుదేరారు.

మాలారీ 'పెంటీ' చేరుకునేసరికి సూర్యుడు చెట్ల చాటునుండి దాగుడుమూతలు ఆడుతున్నాడు. రాత్రింతా నిదురలేక అందరి ముఖాలన్ని పీక్కుపోయాయి 'మనకు ఇంతకంటే మంచి స్థలం ముందెక్కడ దొరకదు. ముఖాలు గిట్లా కడుక్కునేదుంటే ఇక్కడే కడుక్కోండి' రూట్ గైడ్ హెచ్చరిక విని. అందరము లారీ దిగి బిలబిలమంటు జిల్లా పరిషత్తు స్కూల్ ఆవరణంలో ఉన్న బావికేసి నడిచా.

తిగ్గి అక్కడినుండి బయలుదేరేసరికి ఉదయం తొమ్మిదైంది. ఎండ చిటపటలాడుతుంది. చెట్లచాటునుండింకా చల్లగాలి వీస్తుంది. నేను అడివిలోకి చూపు అందినంత మేరకు చూస్తుండిపోయాను. నా తాపత్రియమంతా అడివిలో ఏవైనా జంతువులు అగుపిస్తాయేమోనని కాని ఏం కనిపించలేదు. ఆడివిలో చిన్న చిన్న బోడులు వాటిమీదికి కూడా వ్యాపించిన చెట్లు, చిన్న చిన్న కాలువలు, ఎత్తుపల్లాలు. బాగా ఏపుగా పెరిగిన చెట్లు అడివి మొత్తంగా పచ్చగా ఉంది.

ఆదిలాబాద్ ప్రత్యేకత గురించి, సహజ సంపదల గురించి అక్కడి గిరిజనుల గురించి మాతోటే ప్రయాణిస్తున్న ఓ తెలుగు పంతులు అతని పక్క కూచున్న అతనితో చెప్పుతున్న విషయాలు నాకు చాల ఆసక్తి కలిగించాయి. అటువైపు చెవి మొగ్గాను.

"ఈ ఆదిలాబాద్‌లోని గోండులు, కొలామ్‌ల భాషకు ఎంత ప్రాచీన చరిత్ర ఉందో మన తెలుగుకు అంతే ప్రాచీనత ఉంది కాకుంటే కాలక్రమేణ తెలుగువారు రాజ్యాలు ఏలటము తద్వారా తెలుగు భాషకు రాజాదరణ కల్గటము వలన అది బాగా అభివృద్ధి చెందింది అందుకే మన తెలుగు భాష ప్రారంభ దశలో ఎలా ఉందో అధ్యయనం చేసేవారికి ఈ గోండు కొలామ్ భాషలు అధ్యయనం చేస్తే మరికొంత విషయం తెల్వచ్చు"

నాకా మాస్టరు మాటలు ఆసక్తి కలిగించినయి. ఉత్సాహాన్ని ఆపుకోలేక 'మరిక్కడి గిరిజనుల జీవన పరిస్థితి ఎట్లా ఉంటుందంటారు మనం ఇంత దగ్గర్లో వున్నా వారి జీవన విధానం ఏమిటో తెలియదు'

ఆ బోడితల తెలుగు మాస్టరు ఒక్కసారి నావైపు చూసి 'ఎవడి బ్రతుకు వాడు బ్రతకటమే కష్టమైపోతుంటే ఇంకొకని గురించి పట్టించుకొనే తీరికెక్కడిది. నేను ట్రైబల్ టీచరుగా పనిచేస్తున్న కాబట్టి వద్దనుకున్నా వాళ్ళ బ్రతుకుల గురించి అంతో ఇంతో అవగాహన చేసుకోవటం జర్గింది."

కాసేపు ఆగి దీర్ఘంగా నిట్టూర్చి మళ్ళీ చెప్పటం మొదలు పెట్టాడు.

"అడవుల్లో జంతువులతీర్గ బ్రతుకుతున్నారు. ఒక్కొక్కసారి చూస్తుంటే వీళ్ళకంటే జంతువులే నయమనిపిస్తుంది. ఏదో ఇంత భూమి దున్ని గింజలుపోస్తరు

పక్షులు, జంతువులు మిగిల్చినయి అదైనా సరిగా వర్షాలు సమయానికిపడ్తే నే ఓ రెండు మూడు నెలలు పొద్దుపోతది. ఇంకా ఆ తర్వాత ఆకులు అలుములు తింటరు అరు గాలాలుపాటుపడ్డా బువ్వకెప్పుడు కటకటే, ఇకపోతే ఆదిలాబాద్ పత్తిపంటకు ప్రసిద్ధి అంటరు. గా పత్తిపంట భూములన్నీ మైదాన ప్రాంతమునుంచి వచ్చిన షావుకార్ల చేతిలోనే ఉన్నాయి. గిరిజనుల భూములు కొనద్దు అమ్మద్దని చట్టాలున్నాయి అవన్నీ కాగితాలల్లనే. ఇకపోతే ప్రభుత్వ కో-ఆపరేటివ్ సొసైటీలున్నాయి. వాళ్లు ఉన్నంత దోపకము దునియాల మరెక్కడ కన్పించదంటే నమ్మ."

అతనింకేదో చెప్పటానికి సిద్ధపడుతుండగానే లారీ మరోచోట ఆగింది. నలభైనెంబరు బూతువచ్చింది. దానికి సంబంధించినవాళ్ళు దిగండి' అంటూ అప్ప డికే మాకంటే ముందుచేరిన మారూట్ ఆఫీసరు ఆగిన లారిముందుకొచ్చి చెప్పిండు.

అ తెలుగు పంతులు మరో నల్గురు వాళ్ళ ఎస్కార్ట్ దిగిపోయిండ్లు.

నలభై ఒకటవ నెంబరుగల మా పోలింగ్ బూతుకు పోవాలంటే అక్కడినుండి రిజర్వు ఫారెస్టులో 15 మైళ్ళు బండిబాటన పోవాలి

'ఇక ఇక్కడినుండి లారీ నడువది. అందరుకల్సి ఒకేజీపులో వెళ్తేమంచిది. మా రూట్ గైడ్ మాటలు వినిపిస్తున్నాయి.

"ఏదో ఒకటి తొందరగా తెమల్చండయ్యా" విసుగ్గా అన్నాడు. రూట్ ఆఫీ సరు బరా బరా గడ్డాన్ని గోక్కుంటు.

లారీనుంచీ మా పోలింగ్ బూత్ సామాను తీసుకొని ఒకే జీబులో సర్ది రూట్ ఆఫీసరు, రూట్ గైడు, నల్గురు పోలీసులు, మా ప్రిసైడింగ్ ఆఫీసర్‌తో కల్సి మేం నల్గురం ఒకే జీబులో కూరుకపోయి కూచున్నాం.

గతుకుల రోడుమీద జీబు ముందుకు సాగింది. రోడు కడ్డంగా ఉన్న కొయ్యలను తప్పించలేక డ్రైవర్ ఇబ్బంది పడిపోతు "ఇటువంటి రూట్‌లో నా సర్వీసులో రాలేదు సార్" అన్నాడు.

'అంతేకదా మీ ఆఫీసువాళ్ళకు అడవులలోని ఏంపని. అంతా సిటీలనే తిరుగుడాయే" రూట్ ఆఫీసరు.

"ఏం ఆఫీసు" అతని పక్కన కూచున్న పటేలు.

"కమర్షియల్ టాక్స్ ఆఫీసుసార్"

హఠాత్తుగా జీబు ఒక్కసారి చిన్న గయ్యిలో దిగబడింది అందరం దిగి నెట్టితేగాని మళ్ళ కదిలింది కాదు.

"వారెవా బలేరూట్‌లో పడ్డామయ్యా" మా మునలిప్రిసైడింగ్ ఆఫీసరు నడుం మీదచెయ్యేసుకొని తీడుకుంటా అన్నాడు.

'నడుమునొప్పా సార్' అన్నాడు మధు జోగ్గా.

"డ్యూటీకదా సార్ తప్పుద్దా" రూటు ఆఫీసరు మా ప్రిసైడింగ్ ఆఫీసరుకు మద్దతుగా పలికిండు.

"క్యాసాబ్ హమారే జైసా వోల్డ్ ఫెలోస్‌కు ఈ రూట్లో వేయిస్తే ఎలాగండి మళ్ళీ ప్రాణంతో తిరిగిపోగలమా" రూటు ఆఫీసరును ఉద్దేశించి మా ప్రిసైడింగు ఆఫీసరన్నడు.

"మీరేం భయపడకండి సార్, మిమ్మల్ని పువ్వుల్లోపెట్టి తిర్గి పంపిస్తం"

"అంతే అయుతట్టుంది పువ్వులతోపాటు నాల్గు చప్పల్లు కూడా తెప్పించండి ఏకంగా కైలాసం పోవచ్చు. అసలింతకూ మీరీ రూట్లో ఇదివరకెప్పుడైనా వచ్చారాః"

"అబ్బె ఈ రూట్ల ఇదివరకెప్పుడు రాలేదు కాకుంటే నిన్న ఒక్కసారి ఈ రూటు చూసేందుకు వచ్చినం"

జీబు మరోసారి రోడ్డును అడ్డంగా చీల్చిన ఒర్రెలోనుండి ఎంతకు కదలలేదు. "మరోసారి మీరంతా దిగాలి సార్" డ్రైవర్ నీరసంగా అన్నాడు.

మరోసారి అందరు దిగి తోస్తేగాని కదిలింది కాదు జీబు. అప్పడికే నెత్తి మీదకు వచ్చిన సూర్యున్ని చెట్లు కప్పేసినయి మధ్యాహ్నపు సూర్యుడు చెట్ల మాటు నుండి చొచ్చుకొచ్చిన కిరణాలతో మామీద దాడి చేస్తున్నాడు. పోను పోను రోడ్డు కడ్డుగా కర్రిలు దుంగలు నీటికి కొట్టుకొచ్చినయి నిల్చి జీబును ముందుకు సాగ నియ్యలేదు.

"ఏమయ్యా పటేల్! రూటు బాగు చేయించని చెప్తే చేయించనేలేదు" రూటు ఆఫీసరు పక్కనకూచున్న పటేలు నుద్దేశించి అన్నాడు.

"చెప్పానుసారు గాడ్డికొడుకు చెయ్యనట్టుంది" అంటు ముందుకు కదిలి తోవ కడ్డంగా ఉన్న చిన్న దుంగను జరిపాడు.

అలా తోవకడ్డంగా వున్న కర్రలను ఏరేస్తూ మరికొంత దూరం సాగినం. ఇదంతా మొత్తానికైతే మంచి థ్రిల్లింగ్‌గా ఉత్సాహంగా ఉంది. నా మిత్రుడు మధు మాత్రం తన దురదృష్టాన్ని (ఈ రూట్లో పడ్డందుకు) తిట్టుకుంటూ పడుస్తున్నాడు.

మరో గంట సాగింది ప్రయాణం.

"అదిగో ఊరు సమీపించింది. ఆ కనిపించే బోడు దాటితే ఊరు వచ్చినట్టే" మా రూటు గైడ్ ఆపూరి పటేల్ అయిన లక్ష్మయ్య అన్నాడు.

ఊరు అయితే కన్పించలేదు కాని జీబు వంపులోకి దిగటం ఎండిపోయిన రొడ్డి వాగు ఒకటి దాటేందుకు మరోసారి దిగటం- 4 వీల్స్‌లో జీబు వాగు దాటడం జర్గింది మరోసారి అయితే ఇరువైపుల పెరిగిన పెద్ద పెద్ద వృక్షాల మధ్య మెలికలు తిరుగుతూ సాగే వాగును చూస్తే ఆనందాన్నిచ్చేది. కాని కడుపులో సుర సుర ఆకలి మండిపోతుంటే ఆ ఆనందాన్ని ఆస్వాదించే ఓపిక ఎవరికీ లేదు.

అడివిలో ఆ పూరు చేరుకునేవరకు కూడా ఊరు చేరినట్టుగా అన్పించలేదు ఊరు అంటే నాకు అంతకు ముందున్న అభిప్రాయం తారుమారైంది. సరిగ్గా వేళ్ళ మీద లెక్కపెట్టగలిగిన పది గుడిసెలున్నాయి. అంత అడివిలో కూడా ఇంటిమీది పైకప్పులు సరిగా లేకపోవటం నాకు ఆశ్చర్యం కల్గించింది. ఆ పది గుడిసెలను ఆనుకొని కర్రలతో కంపతో నాటిన ఎనుగు, వాటినానుకొని వేసిన వంజున్న సువ్వ సేను కలిపివేసి ఉంది. ఆ సేనును అనుకొని మళ్ళీ అడివి మొత్తంగా ఒక కిలో మీటరు పరిధిలో అడివి మధ్యగా ఉందా ఊరు. అసలది ఊరు కాదు గూడెం అంటారని తర్వాత తెల్సింది.

మా జీబు సప్పుడు విని పిల్లలు, ఆడవాళ్లు ముసలివాళ్ళు గుడిసెలనుంచి తలలు బయటికిపెట్టి భయం భయంగా చూస్తుండిపోయారు. పిల్లలు కొందరు మేపుతున్న పశువుల మందను అడివిలనుంచి మైదానంలోకి మళ్ళిస్తున్నారు కంగారుగా. 184

జీబువచ్చి ఫారెస్టు గెస్టుహౌజ్ (అదే మా పోలింగ్ బూత్ కూడా) ముందాగింది. మొదట్లో గెస్టుఅవుజంటే అదేదో పెద్ద భవంతి అని భావించాను కాని నా ఊహ తప్పయింది. ఆ గుడిసెల మధ్య తలుపులు కిటికీలు సరిగాలేని రెండు గదుల పెంకుటిల్లు. దానివెనుక చిన్న వంటశాల, స్నానాలగది ఉంది. చాలరోజులుగా అక్కడెవరు నివసించటం లేదనటానికి నిదర్శనంగా ఆ ఇంటిచుట్టు నడుముల మంటికి పెరిగిన గడ్డితుప్పలున్నాయి. గబ్బిలాల వాసన గదులనిండా వ్యాపించిఉంది. గెస్టుహౌజ్ నానుకొనివున్న విశాలమైన వేపచెట్టు. ఎప్పుడో గెస్టుహవుజ్ కొత్తగా కట్టినప్పుడు పెట్టిన నిమ్మచెట్టు కల్సి అక్కడ చల్లదనాన్ని ఇస్తుంది.

మా జీబు ఆగిన చోటికి రుమాలు చుట్టుకున్న తెల్లటి బుర్రమీసాల ముసలతను అతని ప్రక్కన లావుపాటి చేతివేళ్లున్న యువకుడు, పచ్చ బనీను వేసుకొన్నాడు మరో కతను నల్లటి చిప్పిరెంటుకలు కల్గిన నాలుగేండ్ల అమ్మాయిని సంకలేసుకొనివచ్చిండు.

"తిండికేమన్నా ఇంతజామ్ చేస్తివా ఎంకులు" పటేల్ లక్ష్మయ్య అడిగిండు.

"బాంచెను నిన్న మీరు చెప్పినట్టు నల్గురు మనుసులను ఇవ్వాల ఉండమని చెప్పిన. మీకోసం చూస్తు వాళ్ళివ్వాల పనులకు పోలేదు"

"వీళ్ళిద్దరే ఉన్నారు ఇంకిద్దరేరి" ముసలాయెన వెనుకున్న వాళ్ళనుచూస్తు పటేల్.

"రే హన్మంతు పోషాలు లచ్చిగాన్ని తీస్కరాపో" అన్నాడు బదులుగా.

పచ్చ బనీను యువకుడు మారు మాట్లాడకుండా అక్కడినుండి కదిలిపోయిండు.

"పొద్దటినుండి ఎవ్వరు ఏమితినలేదు నీళ్ళో నిప్పులో తెచ్చి వంట చెయిండ్లి తొందరగా" పురమాయించిండు పటేలు,

"అయ్యా మీరు తెచ్చిన సరుకులు చూయిస్తే మొదలుపెడ్తం" అమ్మాయిని ఎత్తుకున్నతను అన్నాడు. అతని పేరు చంద్రియ్య. "అగ్గో అదేమూట" అంటూ మావెంట తెచ్చుకున్న బియ్యం, పప్పులుప్పులు ఉన్నమూట చూయించాడు.

చంద్రియ్య ఆ మూటను లాక్కొని గెస్టుహవుజ్ వెనుకనున్న వంట గదికేసి నడిచిండు.

అంతలోకే మా ఎలక్షన్ ఆఫీసరు తెచ్చిన సామాను సర్దుకోవటం గురించి పోలింగ్ బూత్ ఎటువైపు పెడ్తే బాగుంటుందో ఆలోచిస్తు అన్ని సరిగా ఉన్నాయో లేదో లెక్క చూసుకుంటు రేపటికోసం అన్ని ఏర్పాట్లు సరిగా చూసుకునేందుకు సిద్ధమైండు.

నిజం చెప్పాలంటే నూరెంతో ఉన్న పోలింగ్ బూత్. ఎగాపూర్ గోమధరి ఎస్లాపూర్ మూడూళ్ళు కల్పితే '220' మంది వోటర్లున్నారు. నేను నా మిత్రుడేమి పనిచేయకుండా మాకోసం వేసిన నులక మంచంలో కూచున్నాము.

"అబ్బా ఈ అడివిలో కూడా ఎలక్షన్ల కోసం బూత్‌లు పెట్టారంటే నిజంగా మనదేరా ప్రజాస్వామ్యం" అన్నాడు మధు.

నేనేమి బదులు పలుకలేదు.

అప్పటివరకు కాస్త విశ్రాంతికోసం కూచున్న రూటు ఆఫీసరు సిగిరెట్టు కాలుస్తూ ఎస్కార్టుగా వచ్చినజమేదార్ మరోఇద్దరుజవాన్లచూసి "మనమింకా వెల్దామా" అన్నాడు.

"ఒక్క నిముషం ఆగండి సార్ మీకోసం చాయ్ ఏర్పాటు చేసాను చాయ్ తాగిపోదురుకాని అంటు పటేల్ లక్ష్మయ్య వారించిండు.

అదేదో తొందరగా కానియ్" అన్నాడు రూటు ఆఫీసరు. నీళ్ళకు పోతున్న "హన్మంతును పిల్చి" లచ్చమ్మను తొందరగా చాయ్ తెమ్మను అన్నాడు.

పోలింగ్ బూత్‌కు ఎస్కార్టుగా వున్న రిజర్వ్ జమేదార్‌తో ఏదో మాట్లాడు తున్నాడు "మీరు అప్రమత్తంగా ఉండండి ఎప్పుడూ లోడుసిదే ఉండాలి. మీకు చెప్పాల్సింది కాదనుకో కాకుంటే ఇక్కడ పరిస్థితేమి బాగాలేదు.

"మా బ్రతుకులన్ని అడివిలనె గడుస్తానయి మేము చూసుకుంటాములెండి" రిజర్వు జమేదారు బదులు పలికిండు.

అంతలోకె లచ్చమ్మ కేట్లీలో నల్లటి డికాషన్ లాంటి చాయ్ తెచ్చింది ముడు తలు పడ్డ మొఖము, ఎప్పుడు పొగాకు నమలటం వలన గారపట్టిన పండ్లతో తొడు క్కున్న బట్టలు ఏ రంగైంది తెలవటం లేదు. దూరం నుంచే పటేల్‌ను చూసి "దండాలు బాంచెను" అంది.

186

"ఏం లచ్చమ్మా బాగేనా" బదులు పలికిండు పటేల్.

"ఏంబాగు బాంచెను సావకుంట బతుకుతానం. గిప్పుడు పరే ఇంకా రెన్నెల్లు పోతే తాగేందుకు నీళ్లకూడా దొరకయి." చాయను గిలాసల్లో పంపుతూ అంది.

పటేలు చాయ్‌గిలాసలు అందుకొని ఒకటి రూట్ ఆఫీసరుకు మరొకటి పోలీసు జమేదారు కిచ్చిండు.

"సెళ్ళకు బాయి వుందికదా" అన్నాను ఉండబట్టలేక.

"ఇవ్వుడే కపికెడు కపికెడు తోడుకుంటానం ఎండకాలమైతే ఎండిపోతది ఇక వానకాలమైతే గంగదాటనియ్యదు"

"మరి బ్రతుకెట్లా"

"అగ్గో గుడిసెలచుట్టు జొన్న చేను వేసుకొన్నం అవే ఏమన్నా మిగిలితె అదే తింటం."

"అడివి జంతువులు పంటలు నాశనం చెయ్యవా" అన్నాను మళ్ళీ.

"చేస్తయి, జంతువులురాకుండా కంచెవేసో కాపుందో పంటను కాపాడుకోవచ్చు కాని బాకీలున్న షావుకార్లు ఊకుంటరా" ఇంకాఏదో చెపుతుందనుకున్నాను భారంగా నిట్టూర్చింది పటేల్ కేసి చూస్తూంది. ఆ వెంటనే ఖాళీ అయిన గిలాసలు తీసుకొని కడిగి మరో రెండు గ్లాసులు నింపి పటేల్‌కు ఇవ్వబోయింది. 'ముందా జవానకు ఇయ్యి వాళ్ళు ఎల్లిపోవాలి' అంటూ రూటు ఆఫీసర్‌కు ఎస్కార్టుగావచ్చిన జవాన్లను సూయించిండు.

పటేలు ఉండి ఉండి 'లచ్చమ్మా నీ నల్గురు కొడుకులు ఇక్కడ ఉన్నారా. అడిగిండు.

ముసల్దాని మొఖంలో విచార చాయలు కమ్మినయి; 'ఎక్కడిది బాంచెను పెద్దోడున్న మూడోడు గంగదాటి ఎల్లిండు. ముందటేడు రెండోవాన్ని గుడ్డేలుగుకొట్టింది' ఇగిప్పుడు చిన్నోడు నేనే ఉంటానము.'

"ఊరిడిచిపోయినోళ్లేమన్నా సంపాయించిండ్లా? నువ్వుకూడా [illegible]తోనే పోక పోయినావా?" పటేలు అడిగింది.

"ఎక్కడికి పోయినా ఏమున్నది బాంచెను. గీరెక్కలున్నంత కాలమే బ్రతుకు ఈరెక్కలు లేకుంటే బ్రతుకెక్కడలేదు. ఊరిడిచి ఊట్నూర్లకుపోయిన నా యిద్దరు కొడుకులు ఏం సంపాయించిండ్లు కాంట్రాక్టరు దగ్గరోడు పనిలున్నడు. చేసినన్ని రోజులు తింటాండ్లు పనిలేనినాడు ఇక్కడిలాగె అక్కడ పస్తులు పంటాండ్లు.

లచ్చుమ్మ మాటల మధ్యనే రూటు ఆఫీసరు లేసి 'మేం బయలుదేరుతాం. ఏమండి మాస్టరుగారు అన్ని ఏర్పాట్లు సరిగా ఉన్నట్టేకదా మమ్మల్నింకా సెలవు తీసుకోమంటారా' అంటు మా ప్రిసైడింగ్ ఆఫీసర్ను అడిగిండు.

అంతవరకు లెక్కలు సరిగా చూసుకున్న మా ప్రిసైడింగ్ ఆఫీసరు "మంచిదండి మళ్ళీ రేపు ఐదు గంటల వరకు వస్తారుకదా!" అన్నాడు.

"అంతవరకేం చేస్తామండి అంతకంటే ముందే వస్తాం వీలైనంత తొందరగా ఇక్కడినుండి బయలుదేరాలండీ" అంటూ "మీకు ఇంకేమన్నా అవసరమైతే ఇగో పటేలున్నడు వార్ని అడగండి" అంటు వెళ్ళి జీబులో కూచున్నాడు.

జీబు బురబురలాడుతూ తిరుగు ప్రయాణం మొదలుపెట్టింది. జీబు పోయిన దిక్కే పిన్నలు పెద్దలంతా భయం భయంగా చూస్తుండగానే చెట్లమాటుకు కనుమరుగైంది.

"ఏంటీ వీళ్ళు జీబుకేసి ఏంతగా అలా చూస్తున్నారేంటీ" నా పక్కనే కూచున్న పటేల్ నా మాటలు వినిపించుకొని వినిపించుకోనట్టే ఎటో చూస్తుండిపోయాడు. అంతవరకు నిర్లిప్తంగా నిలుచున్న తెల్లటి గుబురు మీసాల, నెత్తికి రూమాలు పేలక చుట్టుకున్న ముసలతను నా ప్రశ్నకు బదులుగా అదే నిర్లిప్తతతో కూడిన చూపులతో ఇలా అన్నాడు.

"మా వూరికి జీపులు ఎందుకస్తయిసార్ ఏదైనా జీపువస్తే ఫారెస్టు వారిదో, లేకుంటె షికారుకోసం వచ్చెటోల్లదో. పోయిన ఎలక్షన్ అప్పటినుండి ఎలక్షను జీబులొస్తున్నాయి" అన్నాడు యదాలాపంగా.

"అయితే తాత నీవు ఎన్నిసార్లు ఓట్లేసినావు" మళ్ళీ అడిగాను.

"పోయిన ఎలక్షనప్పుడు ఒక్కసారి, కడెం నారాయణదొర నిలుసున్నప్పుడు గిట్లనే గీ పటేల్‌దొర వచ్చి రేపు ఓట్లున్నయి బిడ్డా మీరంతా వచ్చి వెయ్యాలని.

మముల్నందర్నీ తోలుకొని 'ఇటికాల'కు తీస్కపోయి అదేదో చెయ్యి గుర్తుమీద ఓట్లే యించిండు గట్లా ఏదన్నా పనిలేకుంటే దొరలు ఎందుకొస్తరు బాంచెను" అన్నాడు.

ఆ మాటలకు పటేల్ మొఖంల ఎందుకో విసుగు తాండవించింది.

ఆ గుడిసెల నానుకొని చిన్న పెంకుటిల్లుంది.

"అది ఎవరిదండీ" మళ్ళీ అడిగాను ముసలతన్ని అతను ఎందుకో చాల శాంతంగా బదులు పలికిండు.

"ఫారెస్టు గార్డుది మొన్నటిదాకా ఇక్కడే ఉండెటోడు. ఈమధ్య ఇక్కడ ఉంటలేడు 'పెంబి'ల ఉంటాండు. ఎప్పుడన్నా నెలకోసారి వచ్చిపోతడు."

"అదేమిటి"

"వాళ్ళిష్టం ఎవరు అడుగుతరు నెల తిరిగేసరికి జీతమొస్తే సరి"

ఆ మాటలకు మా ప్రిసైడింగ్ ఆఫీసరు అంతవరదాక ఎలక్షన్ సామాను లెక్కలు చూసుకుంటున్నవాడల్లా, ఒక్కసారి తలెత్తి జారిపోయిన కళ్ళద్దాలు సరిచేసుకుంటు ముసలతనికేసి చూసి "బాగా అనుభవజ్ఞుడే" అన్నాడు ఎందుకో? బహుశా అతని మాటలు ఆయన్ని ఆకర్షించినట్టుంది.

మంచంలో కూచున్న పటేలు అకారణంగా నవ్వి "మనమున్నది నాయకపోల్ల గూడెం. వీళ్ళకు కాస్త బయటి ప్రపంచంతోని అంతో ఇంతో సంబంధం మొదటి నుంచి ఉంది. ఇంకా అడివిలోకిపోతే గోండులు, కోలాములు, మచ్చలీర్లు, పచ్చ బొట్లోల్లుంటరు. వాళ్ల వీళ్ళంతా తెలివిమీరినోళ్ళు కాదు. వీళ్ళు కుడిచెయ్యిఅలాంటి వాళ్ళయితే వాళ్ల ఎడమచెయ్యి వంటోల్లు" అన్నాడు.

దాంతో ముసలతను మళ్ళీ ఇలా అన్నాడు "అంత అడివిల అడివి జంతువుల తీర్గ బ్రతికేటోళ్ళం. మాదాంట్ల మాకు తేడాలేమున్నయి బాంచెను"

పటేలు మళ్ళి అందుకొని "అట్లా అంటాండ్లుగాని వీళ్ల ఒకప్పుడు బాగా బ్రతికినోల్లె నా ఎరుకల మీరు కూపులు గుత్తకు తీసుకున్నప్పుడు ఎవడన్నా మా మాట వినేదా? నాల్గుపైసలు చేతుల ఆడెసరికి మా అంతటోడు లేడనిరి?

"ఆ రోజులు తలుచుకుంటే ఇప్పుడు మళ్ళీ వస్తాయా బాంచెన్" అన్నాడు ముసలతను.

పిరిసైడింగ్ ఆఫీసర్ను ఉద్దేశించి పటేల్ మళ్ళీ ఇలాచెప్పసాగిండు "అప్పట్లో అడివిని గుత్తకు తీసుకున్న కంటాక్టర్లు, నరికిన కలపను తీస్కపోయేందుకు అప్పట్లో ఇప్పటిలెక్క లారీలు లేకుండె. అసలింతకు అడివిలకు మనిషి ఒంటరిగా వచ్చేవాడు కాదంటే నమ్మ. అప్పటి అడివిల ఇప్పుడు పైసమందం లేదు. ఈ మధ్య కాలంల ప్లాంటేషన్ చేసి ఇప్పుడిప్పుడు దీన్ని రిజర్వు ఫారెస్టుకిరింద చేసిండ్లు కాబట్టి మనకు ఈమాతరిం కనిపిస్తాంది. అటువంటి రోజుల్లో నరికిన కలపను బయటికి తీస్కపోయేందుకు ఈ నాయకపోల్లు బండ్లు కట్టి తీస్కపోయి 'పెంబి'లో కంటాక్టరుకు అప్పచెప్పెటోల్లు. అప్పట్లో ఈయనకు పదహారుబండ్లుండేయి. నెలకు ఎంతలేదన్నా నాల్గు ఐదువందలు సంపాదించెటోడు. ఎప్పుడైతె అడివిలకు దాకులు ఏర్పడి లారీలు వచ్చుడు మొదలయిందో అప్పుడిక వీళ్ళపని పన్నది. ఆ తర్వాత కాలం అప్పుడు సంపాదించుకున్నవి తిని కూసున్నరు" అని.

నాయకపు ముసలతను అవునన్నట్టుగా తలూపిండు.

పని ముగించుకొని చేతులు దులుపుకుంటు పిరిసైడింగ్ ఆఫీసర్ వచ్చి మంచంలో కూచుని "బాగా అలిసి పోయామండి రాతిరి సరిగా నిద్దురలేదు స్నానంచేస్తే కాస్త హుషారుగా ఉంటుందేమో" అన్నాడు పటేల్ నుద్దేశించి.

"దాందేముంది చెయ్యండి" అంటూ "అరె ఎంకులు! సార్లు స్నానం చేస్తరట ఇంకో పొయ్యిపెట్టి నీళ్ల కాగబెట్టు" అంటు పురమాయించాడు పటేల్.

పచ్చ బనీను వేసుకున్న ఎంకులు అనే ఆ యువకుడు తన అమాయకమైన ఎర్రటి మచ్చల మొఖాన్ని అటు ఇటు ఆడించి కుండ పట్టుకొని నీళ్ళకు పోయిండు అతర్వాత రాళ్ళు పేర్చి చిన్న చిన్న పుల్లలను, దుంగలను తెచ్చి మంటేసిండు. మరి కొద్దిసేపట్లో సల సల మరుగుతున్న పొయ్యిమీది నీళ్ళకుండను వట్టి చేతులతోనే దింపి నీళ్లు తోడిండు.

నాకు ఆశ్చర్యమేసింది అలా వట్టి చేతులతోనే అంత మరుగుతున్న నీళ్ళ కుండను ఎలా దింపి. పట్టుకపోయాడని. అతని లావాటి కాయలు కాసిన మొద్దు చేతులకేసి చూసాను. అతను యథాలాపంగా మరో నీళ్ళ కుండను పొయ్యి మీదికి ఎక్కిస్తున్నాడు. మనిషి చూడటానికి పెద్ద బలవంతుడుగా కనిపించకున్నా, అడ్డం

190

దిడ్డంగా పగిలిన కండల్లో ఏదో అద్భుతమైన శక్తి ఉండనిపించింది. మట్టికొట్టుకు పోయిన పాదాలు చలికి పగిలిపోయి వున్నాయి.

పటేలు మరో ఇద్దర్ని ఆ గూడెం నుండి పిలిపించి వంట ఏర్పాటు చేయించాడు. మేము ఇక్కడికి వచ్చేటప్పుడు కడెం ప్రాజెక్టుకాడనుంచి తెచ్చుకొన్న పెద్ద జెల్ల చేపను కడిగి పులుసు కాచారు. మాతో వచ్చిన హిందీ పండితుడు శాఖాహారి కావటం వల్ల అతనికోసం ప్రత్యేకంగా పప్పుకూడా చేశారు. ముందు జాగ్రత్తకోసం పటేలు వంటసామాన్లుతోని మొదలుకొని అన్నీ జీబులో వేయించి తీస్కరావటం వల్ల మొత్తానికైతే వంట బాగానే ఉండనిపించింది. లేకుంటే నిన్నటి నుండి సరిగా భోజనం చేయక పోవటంవల్లనోగాని అందరు సుష్టుగా చేపముక్క నంజుకుంటు గంజులు కాళీచేసేసరికి నాలుగుంపావు అయింది.

అప్పటికే పశ్చిమాన వంగిన సూర్యుడి కిరణాలు నిలువుగా ఆకాశంకంటూ పెరిగిన చెట్లకొసల చాటున దోబూచులాడుతున్నాయి అంతవరదాకా చెట్లమాటున మాటుగావీప చలి మెల్లమెల్లగా మా మీద దాడికి సిద్ధమైంది.

"ఇంక కొద్ది రోజుల్లో సంక్రాంతి పండుగ అందుకే చలి సంకలు లేప నిస్తలేదు" అన్నాడు హిందీ పండితుడు.

"రాత్రికి ఇంకా చలి బాగుంటుందేమో" అన్నాడు మధు కాస్త ఎండ పడు తున్నకాడ నిలుచుని. పండ్లల్లో చిక్కిన ఆహారపు తునకల్ని సన్నటి పుల్లతో బయిటికి లాక్కుంటు.

పటేల్ "రాత్రికి మంట వేసుకుందాం అడివిల ఎందుకరైలకు కొదువా" అన్నాడు వెంటనే అక్కడ నిలుచున్నడనిని పిల్చి మంట ఏర్పాటు చేయించిండు.

పెద్ద పెద్ద దుంగలను తెచ్చి ఒకవైపు పేర్చి సన్నటి పుల్లలతో మంటేసిండ్లు. మంట రగులుకుంటుంది. మెల్లమెల్లగా మేమందరం మంటచుట్టు గుమికూడాం.

మాకు ఎస్కార్టుగా ఉన్న రిజర్వు జమేదారు కాస్త ముందుకు జగ్గి కాలుతున్న దుంగమీద కూచున్నాడు. అతనికి వెచ్చగా మంట తగిలేందుకు అంతవరకు అక్కడ కూచున్న రిజర్వ్ కానిస్టేబుల్ గౌరవసూచకంగా కాస్త జరిగి కూచున్నడు. సెంట్రి డ్యూటిలో ఉన్న మరో కానిస్టేబుల్ తుపాకి నేలకానిస్తూ వేపచెట్టు నీడన నిల్చున్నడు.

మంట పెద్దది గావటంతో అందరం కాస్త జరిగి కూచున్నాం. ఒకవైపు పటేలు అతనిపక్కన నాయకపు ముసలతను అతని పక్కన ఇంతవరదాక వంటచేసిన ఇద్దరు పచ్చుబనీను ఎంకులు ఆ తర్వాత మేము కూచున్నాం.

తూర్పున సూర్యుడు చెట్లమాటునుండి పైకి వచ్చిండు. వెచ్చటి ఎండపొడ హాయినిస్తుంది. ఆ లేత ఎండకు చలి చెట్లనీడకు పరిగెత్తింది. ఇంకా ఈదురుగాలి చల్లగాసన్నగా వీస్తూంది. లేత ఎండలో గూడెం స్నానమాడుతూంది. ఎవరో ముసల్ది ఓ గుడిసెముందు ఒడలిపోయి ముడుతలు పడ్డ శరీరంతో నిర్లిప్తంగా ఎటోచూస్తూంది. మేకలను, పశువులను తోలుకుంటు పశువులు కాసే పిల్లవాడొకడు అడివిలోకి ప్రియాణమైండు గూడెంలో నిశ్శబ్దంగా జన సంచారం లేకుండా ఉంది.

పోలింగ్‌బూత్‌లో మాపని డిస్ట్రిబ్యూషన్ చేపిండు ప్రిసైడింగ్ ఆఫీసరు. వోటు వేయడానికి వచ్చినవారికి బ్యాలెట్‌ను ఎలా మలిచి పెట్టెలో వేయాల్సింది వివరించే పని నేను తీసుకున్నాను. ఆ కొత్తపని చేయటానికి ఉత్సాహంగానే ఉంది. కాని తొమ్మిదైనా ఓటు వేయటానికి ఒక్కరు రాలేదు

ఓటర్స్‌కోసం మేం మా స్థానాలల్లో కూచొని చూస్తుండిపోయాం ఆ నిరీక్షణలో మరో అరగంట గడిచింది. ఓపిక నశించిపోయింది. మా హిందీ పండితుడు ప్రిసైడింగ్ ఆఫీసర్ను ఉద్దేశించి ఇలా అన్నాడు.

"పది కావొచ్చింది ఓటువేయటానికి ఒక్కరు రారేమిటి అసలింతకు ఇవాళ వోట్లు పోలయితయా లేదా?" అన్నాడు. అతనికి ఈ అడివినుంచి ఎంత తొందరగా పని ముగించుకొని పోతే అంత బాగుండును అన్నట్లుగా ఉంది.

"అదే నాకు అర్థంకాపటంలేదు" అంటు లేచి అతను బయిటికి నడిచాడు. బయట ఎండలో మంచంమీద పటేల్ జమేదారు కూచొని ఉన్నాడు

"ఓట్లెయ్యటానికి ఎవరు రారేమిటి అసలింతకు ఇవ్వాళ ఓట్లు ఉన్నాయన్న సంగతి వీళ్ళకు తెలియనట్టుందే".

పటేల్ సమాధానంగా "అన్నివూళ్ళలో చెప్పి ఉంచాము. ఒకొక్కరు ఐదారు మైళ్లు నడిచిరావాలె దారిలో ఉన్నారేమో"

"ఏమో నాకు అనుమానంగానే ఉంది. ఇటు కాంగ్రెసు నుంచి కాని అటు తెలుగుదేశం అభ్యర్థినుండి కాని ఒక్క పోలింగ్ ఏజెంట్ కూడా లేదు. చివరికి మిగిలింది మనమే. ఇదే సిటీలోగాని, ఏదన్నా పల్లెటూర్లోగాని అయితే ఎంత హడావుడిగా ఉండేదో" అన్నాడు ప్రిసైడింగ్ ఆఫీసరు.

"అదివేరు ఇదివేరు. ఈ అడివిలో పోలింగ్ బూత్ పెట్టడమే గొప్ప. నా ఎరుకల ఎప్పుడు ఇక్కడికి ఈ విధంగా వచ్చిందిలేదు" పటేల్ రెండు చేతులను దౌడలకు అనించుకొన్నాడు.

"అరేయ్ ఎంకులు గూడెంకుపోయి ఉన్నోళ్ళందరిని వోట్లెయ్యటానికి రమ్మని చెప్పు" అంటూ ముసలి ఎంకులును పురమాయించిండు.

అప్పటిదాక మోతుకాకు చుట్టమీద నిప్పుగల్ల వేసుకొని, అది పడిపోకుండా చుట్టను నిటారుగా పట్టుకొని పొగపీల్చుకొంటున్న ఎంకులు నిప్పుగల్లను క్రిందరాల్చి చుట్టకేసి చూసుకుంటూ "గీయాల్లదాక ఎవరుంటరు బాంచెను అంత అడివిలకు బంకకు పోయి వుంటరు" అన్నాడు. అక్కడినుండి కదలటానికి ఇష్టం లేనట్టుగా.

జమేదారు మంచంలోంచి లేచి చలితో మొద్దుబారిన కాళ్ళను కాపుకునేందుకు మంటలో చిటపటలాడుతున్న మొద్దుకాడికి వచ్చి నిలుచున్నాడు.

సూర్యుడు నడి నెత్తిమీదికొచ్చిండు. అయినా వోటర్లు ఎవరు రాలేదు. ఏదైనా గాని ఎవరు వస్తారన్న నమ్మకం లేనట్టుంది ఖాళీ పెట్టెలతో తిర్గి వెళ్ళాల్సి ఉంటుందేమో అనిపించింది.

అంతలోనే దూరంనుండి ఏదో వాహనము వస్తున్న చప్పుడు విన్పించింది. ఈ వేళప్పుడు ఎవరై వుంటారా అని ఆలోచన్లో పడిపోయాము.

చెట్లమాటునుండి జీబు కన్పించింది. అందరం అటువైపు చూసాం.

"నాల్గు అయితేగాని మమ్మల్ని తిర్గి తీసుకెళ్ళేందుకు రారనుకున్న కనివియెన్స్ అప్పుడే వస్తున్నట్టుందే"

పటేలు లేచి దృష్టిసారించి చూసి "పోలీసువాళ్ళ జీబు" అన్నాడు ఖచ్చితంగా.

"ఎందుకై ఉంటుందో?"

"బహుశా పటోరింలింగ్ కావచ్చు" పటేల్.

జీబు మా బూత్‌కాడికొచ్చింది. పటేల్ లేచి పోలీసు జీబుకు ఎదురుపోయిండు. అందులోంచి దిగిన లావైన పోలీసాఫీసర్ను చూసి "నమస్తేసార్" అన్నాడు. అతను ప్రీతిగా చేతిలోని లాటిని ఆడించి నమస్కరించిండు.

ముందు దిగినతను సర్కిల్ ఇనస్పెక్టర్‌లాగున్నాడు. పెద్దతలకు మాంసపు ముద్దలు అద్దినట్టుగా చెంపలు వేలాడుతున్నాయి. ఇన్‌షర్ట్ చెమటవల్ల అతని లావాటి పొట్ట మరింత పొడుచుకొచ్చింది. నగంవరకు మడిచిన చేతులంగీ నుండి బాగా బలిసిన దండలు కనిపిస్తున్నాయి. చిన్నని కండ్లు మూసుకపోయినట్టుగా, ఇప్పుడే నిదుర నుండి లేచినట్టుగా మబ్బుగా ఉన్నాయి.

అతన్ని అనుసరించివచ్చిన సబ్ఇన్స్‌పెక్టర్ ఎర్రగా అందమైనకోలమొఖంలా కొట్టొచ్చినట్టుగా నల్లటి మీసాలున్నాయి. అవి ఊకె తీరటంవల్లనేమో కొసలు వడి తిరిగున్నాయి. కనుకొనుకులనుండి చూసే ఆ చూపులు మాత్రం ఏదో దొంగతనం చేసి పట్టుబడిన దొంగచూపులుగా మాటిమాటికి చంచలంగా అటు ఇటు పరకాయించి చూస్తున్నాయి. వారివెంట జీబులో వెనుకవైపు నక్కి కూచున్న ఆరుగురు సాయుధ భటులు దిగి తుపాకులు పట్టుకొని జీబుకు వెనకవైపున నిలుచున్నారు.

ఉబ్బు చెంపలు కదలాడుతుంటే సర్కిల్ అధికార పూర్వకమైన బొంగురు గొంతుతో.

"పోలింగ్ ఎలా జరుగుతుంది. అంత సవ్యంగానే ఉందా?" అంటూ అడిగాడు.

"ఇంతవరదాక ఒక్కవోటు కూడా పోల్ కాలేదు" అంటూ మా ప్రిసైడింగ్ ఆఫీసరు బదులుపలికిండు.

సర్కిల్ అప్రియత్నంగా రొంటికున్న పిస్తల్ మీద చేతులేపి. ఎస్ఐ కేసి చూసితలాడించి.

"మాకెలవుదా....మనకొచ్చిన ఇన్‌ఫర్మేషనంత కరెక్టైనన్న మాట" అన్నడు. ఎస్.ఐ. గౌరవం ఉట్టిపడేలా తలాడించిండు. అవునన్నట్టుగా.

194

సర్కిల్ పటేల్ వైపు తిర్గి కోపంతో మండుతున్న కండ్లతో. "ఏం పటేల్ ఈ లంజకొడుకులు వొాట్లెయ్యటానికి ఎందుకు రాలేదు." "వోట్లున్నాయని గూడెంల చెప్పలేదా."

పటేల్ వెనకకు చేతులు కట్టుకొని "రెండు రోజుల ముందె వచ్చి వోట్లున్న అందరు వెయ్యాలని చెప్పినయ్యా కాని గాడ్డి కొడుకులు ఎందుకురాలేదో తెల్వదు."

"చెప్పినా రాలేదు! లంజకొడుకులకు గమండి పెర్గింది. నక్సలైట్ నా కొడుకులు అడివిల గూడెం పొంటితిర్గి వొాట్లెయ్యద్దని ప్రచారం చెస్తాందని మాకు కబురు వొచ్చింది. అందుకే రానట్టుంది. మాకెలవుడా గాండ్లు" అలా కోపంతో చిరుబురు లాడుతూనే చుట్టుచూసి మాకు కాస్త దూరంలో నిలుచున్న ముసలి ఎంకులు కెసి చూసి చేతిలోని కర్ర ఆడిస్తూ "అరె ముసలోడా ఇటురా లంజకొడుకా" అంటు అరిచాడు.

ముసలి ఎంకులు భయం భయంగా చూస్తూ కాస్త ముందుకొచ్చి నిలుచున్నడు.

"నీదేగూడెంరా" లాటి ఆడిస్తూ సర్కిల్

"ఇదే గూడెం బాంచెను" చేతులు జోడించి

"గూడెపోళ్ళంతా వోట్లేసినారా?" కండ్లెర్రిచేసి

"గీ యాల్లప్పుడు ఎవరుంటరు బాంచెను అడివిల ఆకులు అలములు ఏరు కొని బత్తికెటోళ్లపొద్దున్నే అడివికి పోయిండ్లు బాంచెను" ఆ ముసలతను ఇంకా అలా చేతులు జోడించే నిలబడ్డడు.

"అడివికి పోయిండ్లురా లంజాకొడుకా! నక్సలైట్ నాకొడుకులు గూడెంల కొచ్చి వోట్లెయ్యవద్దని ప్రచారం చేయలేదురా" కాస్త ముందుకు జర్గిండు లాటి ఆడించుకుంటూనే.

"గీ ఓట్ల సంగతి మాకేమెరుక బాంచెను"

"మీకు అన్ని ఎరుకేరా నక్సలైట్ నా కొడుకా" అంటు లాటితో విసురుగా ఒకటేసిండు.

ఈ హఠాత్ పరిణామానికి మేమంతా ఒక్క క్షణం ఖంగుతున్నాం. ముసలి ఎంకులు దెబ్బతాకిన రెంటిని చేత్తో తడుముకొని మరో దెబ్బ తాకుతుందో ఏమో

195

నన్ను భయంతో కింద కూలబడి మళ్ళీ చేతులు జోడించి "కొట్టకు బాంచెను నీ ఉచ్చ తాగుతా నీకాల్మొక్తా నాకేమెరుక బాంచెను" అంటూ దీనంగా బ్రతిమిలాడసాగిండు.

సర్కిల్ మళ్ళీ పటేల్ వైపు చూసి "గూడెంల ఎవరున్నరో పిల్ల ముసలి ముతక అందర్ని తోలుకొచ్చి వోట్లేయించండి ఎవరన్నా లంజాకొడుకు రాకుంటే మాకు చెప్పండి"

పటేల్ తలాడించి "అరేయ్ చంద్రియ్య హన్మంతు" అంటూ అంతవరదాక మాకోసం వంట చేస్తున్నవారిని కేకేసిండు.

వాళ్ళు అక్కడినుండే చేతులు కట్టుకొని గజగజ వణుక్కుంటూ మా దగ్గరికి వచ్చిండ్లు,

సర్కిల్ వాళ్ళ వైపు చూసి, వాళ్ళు దగ్గరికి రాగానే "ఈ లంజ కొడుకులు వోట్లేసిండ్లా" అన్నాడు.

"ఎక్కడిది బాంచెను. పటేలు గా వంటలు చేయమంటే చేస్తానం" అన్నాడు చంద్రియ్యనడుం వరకు వంగి సలాంచేస్తూ.

"ముందు ఈ లంజ కొడుకులతోని వోట్లెయించండి" సర్కిల్ ప్రిసైడింగ్ అఫీసర్ను ఉద్దేశించి అన్నాడు.

ప్రిసైడింగ్ అఫీసరు గబ గబా పోలింగ్ బూతుకాడికొచ్చి వోటర్ల లిస్టు చూసివాళ్ళ పేర్లు అడిగి. తలఅడ్డంగా అడిస్తూ. "లిస్టులో నీళ్ళ పేర్లు లేవు" అన్నాడు.

"అదే ఎందుకు లేవు" సర్కిల్ ప్రిసైడింగ్ అఫీసర్ను అడిగి మళ్ళీ వాళ్ళ వైపుతిర్గి" లంజ కొడుకుల్లారా లిస్టుల మీ పేరెందుకు ఎక్కించుకోలెదురా" అన్నాడు గుర్రుగా.

"మాకెమెరుక బాంచెను" ఇద్దరు ఒక్కసారే బదులిచ్చిండ్లు.

"వాళ్ళ పేర్లు లేకుంటపాయే ఎవరో ఇద్దరి పేర్లమీద ముందా లంజ కొడుకులతోని వోట్లెయించండ్లి లేకుంటే మాకు ఇబ్బంది వస్తది."

ప్రిసైడింగ్ అఫీసరు "అది ఎట్లా జరుగుతుందిసార్" అన్నాడు అభ్యంతరం పెడ్తూ.

సర్కిల్ చిరాగ్గాచూస్తూ. "నీ రూల్స్ ఎవడిక్కావాలయ్యా. ఏ లంజ కొడుకు నెగ్గితే మనకేంది మాకు ఈ బూత్‌ల వోట్లు పడలేదు. ఎన్నికలు బైకాట్ చేసిండ్లంట, మేమేం చేస్తానమని పై నించి లకోటా వస్తది. ఎవని పేరు మీదనో వాళ్ళతోని వోట్లేయించండ్లి. అ లంజ కొడుకులు ఎవనికేసినా పర్వలేదు కాని బూత్‌ల మాత్రం వోట్లు పడాలి" అన్నాడు కోపంగా

మా ప్రిసైడింగ్ ఆఫీసరు ఏమనుకున్నాడో ఏమోగాని "సరే మీ ఇష్టం" అంటు తలాడించి, వాళ్ళతో వోట్లేయించిండు.

అలా మొదటిసారి బూత్‌లో నాల్గు ఓట్లు పడ్డయి. ఆ తర్వాత వాళ్ళిద్దర్ని వెంట పెట్టుకొని ఎస్ఐ మరిద్దరు కానిస్టేబుల్స్‌తో గూడెంలో తిర్గి, మరో నలుగురు స్త్రీలను ఒక్క ముసలతన్ని తోడుకొచ్చిండ్లు. స్త్రీలలో ఇద్దరు కాటికి కాళ్లు చాపుకున్న స్త్రీలు. ఒక స్త్రీ బాలింతరాలు మరొక ముసల్ది ఇందాక వీళ్ళకు చాయ్ తయారు చేసి ఇచ్చిన లచ్చుమ్మ. కండ్లు కనిపించని ముసలతన్ని కూడా తోడ్కొని వచ్చిండు.

అందరితోని ఓట్లేయించుడు అయిపోయింది అనిపించినంక పోలీసు జీబు పక్కగూడెంకు బయలుదేరింది.

బహుశా అక్కడకూడ ఇటువంటి బీభత్సమేదో జర్గి ఉంటుంది అనటానికి నిదర్శనంగా ఆ తర్వాత రెండు బ్యాచీలుగా వోటర్లు వచ్చారు.

దోమ్‌టరి నుంచి వచ్చిన మొదటి బ్యాచీలో ఆర్గురు స్త్రీలు ముగ్గురు పురుషులు వచ్చారు, వాళ్లు పూర్తిగా గోండు తెగకు చెందినవారు. చప్పబడిపోయిన వెడల్పు మొఖాలు కలిగి ఉన్నారు. స్త్రీలు మెడకు చుట్టుకున్న గుడ్డను కొద్దిగాలాగి రొమ్ముల మీద అచ్ఛాదనగా కప్పుకున్నారు. పురుషులకు మొల్లమీద అచ్ఛాదనం తప్ప మరేమి లేదు. వాళ్ళను తోలుకొని వారి వెంట ఇద్దరు సాయుధ పోలీసులు కూడా వచ్చారు. వోట్లు వేయటానికి వచ్చినవారెవరు ఇదివరలో ఎప్పుడు ఓట్లు వేసినవారు కాదు వచ్చినవారెవరికి తెలుగురాదు. మాకెవరికి గోండు భాష రాదు. పటేల్ మాకు మధ్యవర్తిగా ఉండి వాళ్ళకేదో చెప్పాల్సిన నాల్గు మాటలు చెప్పివాళ్ళతోని ఓట్లు వేయించటం జర్గింది.

ఆ తర్వాత మరో గూడెం నుంచి మరికొంత మందిని పోలీసులు తోడ్కొని వచ్చారు.

మొత్తానికైతే, చివరికి 24 వోట్లు పోలయినాయి. ఇంకెవరు వోటర్లు వస్తారన్న నమ్మకం ఎవరికి లేదు. అయినా ఓటింగ్ ముగిసేవరకు అందరం వేచి ఉండాల్సిందే కదా!

అలాగే సమయం గడవటంకోసం నిరీక్షిస్తుండిపోయాము. ఎవరేమి మాట్లాడటం లేదు. ఒక విధమైన భయం, గంభీరత ఆవరించింది.

ఉండి ఉండి మా ప్రిసైడింగ్ ఆఫీసరు భారంగా నిట్టూర్చి "మొత్తానికైతే ఇదంతా గమ్మత్తుగా ఉంది" అన్నాడు.

పటేల్ నోరువిప్పిండు "ఇదంతా డిస్టబ్ ఏరియా సార్ ఇదివరకోసారి గీ పక్కఊల్లనే తాసీల్దారు శిస్తు వసూల్లప్పుడు టూర్ మీద వచ్చినప్పుడు ఈ గోండోల్లందరు మమ్మల్నందర్ని గెరావో చేసిండ్లు శిస్తులు మాపుచెయ్యాలని, మాకేమి చేసారని మీకు శిస్తులు కట్టాలని గెరావో చేసి నాల్గుగంటలసేపు సతాయించిండ్లు. అప్పటినుండి గీ గూడేలకు ఏ అధికారి రావాలన్నా ఉచ్చబడ్తదంటే నమ్మ" అంటూ ఎప్పుడో జర్గిన సంఘటన చెప్పుకొచ్చిండు.

ఆ తర్వాత అటువంటిదే మరో సంఘటన గురించి జమేదారు చెప్పుకొచ్చిండు.

సరిగ్గా మూడు గంటలకు మళ్ళీ మోటుజీబు సప్పుడైంది. ఈసారి వచ్చిందిమాత్రం మా రూట్ ఆఫీసరు ఆయనకు ఎస్కార్ట్‌గా ఉన్న జమేదారు మరిద్దరు సాయుధభటులు ఆయన వస్తూరాగానే హడావుడి పడిపోతూ "ఏమైంది ఏమన్నా వోట్లుపోలయినాయా?" అంటూ అడగసాగిండు.

పటేలు జర్గిదంతా చెప్పుకొచ్చిండు. అతను గడ్డాన్ని బరబర గీక్కుంటు, మధ్య మధ్య అచ్చా ఐసా హోగయా. అంటూ పటేలుచెప్పింది. సాంతంగా విని....

"నాకు ముందె తెల్సు ఇటువంటిదేదో జర్గుతుందని" అని సిగరెట్టు ముట్టించు కొన్నాడు.

"క్యా సాబ్. మనంజల్ది ఇక్కడ నుండి బయలుదేరితనే మంచిది" అన్నాడు ప్రిసైడింగ్ అఫీసరుతో

"అదేంటి సార్ నాల్గింటికి కదా మనం బూత్‌ను కట్టేసేది. ఎవరు వచ్చినా రాకున్నా నాల్గింటి వరకు ఉండాల్సిందేకదాని మే మింకా ఎకౌంట్సు క్లొజ్ చెయలే. సీలు అవి యివి ఇంకా చాల పనుంది ముగించటానికి." నసిగిండు ప్రిసైడింగ్ ఆఫీసరు.

"వోట్లు ఎవరు ఏస్తె మనకెందీ. వెయ్యకుంటె మనకెందయ్యా. పొద్దు కుంకక ముందే ముందు మనం బ్యాలెట్ బాక్సులను తీసుకొని అడివిదాటాలి. ఏమన్నా అయితె ఎవరు బాధ్యులు. ముందా బ్యాలెట్ బాక్సులకు సీల్లు వెయండ్లీ ఇంకేమున్నరాతపూత పనులుంటే అక్కటికి పోయినంక చూసుకోవచ్చు."

ఇంకాస్త అనుమాన పడుతున్న మా ప్రిసైడింగ్ ఆఫీసర్ను చూసి "మీకెం భయం లేదు. మీ పై అఫ్సర్‌గా నేను చెపుతున్నా కదా. తొందరగ తెమిల్చి ఇక్కడి నుండి బయలు దేరాలి."

చేసేదేమి లేక మేము మా పని ముగించాం. మరో పదిహేను నిముషాలకు తిర్గి జీబులో యిరుక్క పోయాం.

ఈ అడివిలో ఏదో భయంకరమైన పిశాచి దాగున్నట్టు. అది మమ్మల్ని కబలించటానికి మాపైకి వస్తున్నట్టు గబ గబ బుర్ బుర్ లాడుతు జీపు ముందుకు కదిలింది.

నా బుర్రలో అంతుపొంతులేని ఆలోచన. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశం.... ప్రజాభీష్టం.... ప్రజల కొరకు.... ప్రజలచేత.... ప్రజలచే.... అంతా అబద్ధం ఇదంతా బూటకం మోసం దగా పెద్దగా అరవాలనిపించింది.

నాపక్కలో ఏదో గుచ్చుకుంటుంది. చూస్తే ఏముంది.... నా ప్రక్కనే మాకు ఎస్కార్టుగా వచ్చిన సాయుధ రిజర్వు పోలీసు తుపాకి కొననున్న బాయినెట్ బ్యాలెట్ పెట్టెలమీదుగా నా పక్కలో గుచ్చుకుంటుంది. బాయినెట్‌ను పట్టి కాస్త ముందుకు జరిపాను. అంతవరదాక కునుకిపాట్లు పడుతున్న జవాను ఒక్కసారి కళ్ళు తెరచి చూసి మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు. బ్యాలెట్ బాక్సుమీద తుపాకి ఇంకా అలాగే ఉంది.

ఒక్కసారి మాకు అంతకంతకు దూరమవుతున్న ఎంగ్లాపూర్ గూడెం కేసి చూస్తుండిపోయాను. పడమటికి వంగిన సూర్యుని అరుణకాంతిలో ఆ గూడెం అంతకంతకు దూరమై చివరికి సూర్యునిలో కలిసిపోయింది.

మేము అడివి దాటేసరికి పశ్చిమాన సూర్యుని సంధ్యారుణ కాంతిలో అడివి మొత్తంగా అంటుకున్నట్టుగా ఉంది.

ప్రజాస్వామ్యాన్ని పొట్టలో పెట్టుకున్న మా జీబు అంతకంతకు అడివినుంచి పారిపోతుంది మైదానం వైపు.

Statement about ownership and other prticulars about

SṚJANA

FORM IV (See Rule 8)

1. Place of Publication ... Warangal
2. Periodicity of its Publication ... Monthly
3. Printer's Name ... P. Hemalatha
   Whether citizen of India? ... Yes
   Address ... SṚJANA
   Hanamkonda 506 001
4. Publisher's Name ... P. Hemalatha
   Whether citizen of India? ... Yes
   Address ... (same as above)
5. Editor's Name ... P. Hemalatha
   Whether citizen of India? ... Yes
   Address ... (same as above)

I, P. Hemalatha hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/- *P. Hemalatha*
Publisher.